సాక్షి
మెదక్

గురువారం । 8 । జూన్ । 2023

ప్రశాంత వాతావరణమే లక్ష్యం

మెదక్ మున్సిపాలిటీ: జిల్లాలో ప్రశాంత వాతావరణం కల్పించి, ప్రజలకు మెరుగైన శాంతి భద్రతలు కల్పించడమే ప్రధాన లక్ష్యమని ఎస్పీ రోహిణి ప్రియదర్శిని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో కొత్త వ్యక్తుల కదలికలు,నిషేధిత కార్యకలాపాలు కనిపిస్తే08452-223533 (ల్యాండ్‌లైన్) 8712657888 సెల్‌కు కాల్ లేదా వాట్సాప్ ద్వారా సమాచారం అందించాలన్నారు.



సింగూరు చేపతో 'మృగశిర'

పర్యాటకులు చేపలతో చేసిన విందుకు తహతహలాడుతుంటారు. చేపలు అంతటా దొరుకుతున్నా సింగూరు డ్యాంలో దొరికే చేపకు రుచే వేరని కితాబిస్తుంటారు.

8లో

రేడియాలజిస్ట్ సస్పెన్షన్?

మెదక్‌జోన్: మెదక్‌లోని మాతాశిశు ఆస్పత్రి(ఎంసీహెచ్‌లో) విధులు నిర్వర్తించే రేడియాలజిస్టు డాక్టర్ భరత్‌ను బుధవారం సస్పెండ్ చేసినట్టు తెలిసింది. గతంలోనూ రెగ్యులర్‌గా విధులు హాజరుకాని విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లింది. అయినా మార్పు రాకపోవడంతో సస్పెండ్ చేసినట్టు సమాచారం.

న్యూస్‌రీల్

డివిజన్ కోసం 48 గంటల బంద్

9, 10 తేదీల్లో సహకరించాలని విజ్ఞప్తి



రామాయంపేటలో కొనసాగుతున్న దీక్షలు

రామాయంపేట(మెదక్): రామాయంపేట రెవెన్యూ డివిజన్ ఏర్పాటు విషయంలో ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈనెల 9, 10 తేదీల్లో 48 గంటలపాటు రామాయంపేట బంద్ నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం అఖిలపక్షం ప్రతినిధులు కరపత్రాలు ఆవిష్కరించి వ్యాపార సముదాయాల్లో పంపిణీ చేశారు. అఖిలపక్షం ప్రతినిధులు పోచమ్మల అశ్విని, దోమకొండ యాదగిరి, వినయ్‌సాగర్, శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ కోసం 73 రోజులుగా దీక్షలు కొనసాగుతున్నా ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. డివిజన్ కోసం మొదటివిడతగా ఏడు నెలల పాటు నిరంతరాయంగా దీక్షలు చేశామని, అప్పట్లో మంత్రి హామీ మేరకు విరమించామన్నారు. కానీ మంత్రి హామీ అమలుకు నోచుకోకపోవడంతోనే మలివిడత దీక్షలకు దిగామన్నారు. రెండు రోజులుపాటు నిర్వహించే బంద్‌కు వ్యాపారులు, అన్ని పార్టీల నాయకులు, యువజన సంఘాలు, కుల సంఘాలు సహకరించి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.


గిరిజన బంధు ఏర్పాటుకు సుముఖం



గిరిజనులతో కలిసి నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి


రామాయంపేట(మెదక్): దళితబంధు తరహాలో గిరిజనబంధు ఏర్పాటు చేయడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ కృత నిశ్చయంతో ఉన్నారని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కోనాపూర్ పెద్దతండాలోని సేవాలాల్ ఆలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడారు. సేవాలాల్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని, జిల్లా కేంద్రంలో బంజారా భవన్ నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేస్తామన్నారు. ఎమ్మెల్యే గిరిజన మహిళలతో కలిసి నృత్యం చేశారు. ఆమె వెంట రామాయంపేట మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.10లక్షలు



ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి కూడా పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. తండావరకు తారురోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఉత్సవాల పేరిట ప్రజాధనం లూటీ



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గద్దం శ్రీనివాస్

నిజాంపేట(మెదక్): దశాబ్ది ఉత్సవాలు నిర్వహించడం ద్వారా ప్రజాధనాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం లూటీ చేస్తున్నదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గద్దం శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన నిజాంపేటలో విలేకరులతో మాట్లాడారు. చెరువు పండుగ సందర్భంగా ఈ నియోజకవర్గంలో ఎక్కడైనా సాగునీరు అందించిన దాఖలాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. ఒకవేళ సాగునీరు వస్తే కేసీఆర్, హరీశ్ రావు, ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి ఫామ్‌హౌస్‌లకు మాత్రమే అందాయని ఎద్దేవా చేశారు. రామాయంపేట రెవెన్యూ డివిజన్ కోసం ఆనాడు మంత్రి హరీశ్‌రావు ఇచ్చిన మాట నిలుపుకోలేదని, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి కూడా డివిజన్ ఏర్పాటుకు సుముఖంగా లేదన్నారు. ఈ సమావేశంలో నేతలు రాజేంద్రప్రసాద్, ఎక్కలదేవు మధు, సురేష్, మావురం లక్ష్మణ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవల్లో ఫస్ట్

మే నెలలో మొదటిస్థానంలో నిలిచిన మెదక్ జిల్లా

మెదక్‌జోన్: వైద్య సేవకు సంబంధించి మే నెలలో మెదక్ జిల్లా రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలిచింది. ప్రధానంగా ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాలు, మాతా శిశువుకు వ్యాక్సినేషన్, నార్మల్ డెలివరీలు, రక్తహీనతను అధిగమించటంతో పాటు అన్ని రకాల వైద్యసేవల్లో మెదక్ ఫస్ట్ రాగా, సిద్దిపేట జిల్లా 9, సంగారెడ్డిజిల్లా 19 స్థానంలో ఉంది.

- మెదక్ జిల్లాలో 19 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉన్నత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మాతాశిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్), నర్సాపూర్, తూప్రాన్, కౌడిపల్లి ఏరియా ఆస్పత్రులు, రామాయంపేట కమ్యూనిటీ హెల్త్‌సెంటర్, మెదక్ జిల్లా కేంద్ర ఆస్పత్రి ఉన్నాయి.
- మెదక్ జిల్లా కేంద్రఆస్పత్రితో పాటు అర్బన్ సెంటర్, రామాయంపేట, కౌడిపల్లి, నర్సాపూర్, తూప్రాన్‌లలో ఉన్న ఆస్పత్రులు వైద్యవిధాన పరిషత్ పరిధిలోకి వస్తాయి.
- మిగతా ఆస్పత్రులు జిల్లావైద్యారోగ్యశాఖ పరిధిలో ఉన్నాయి. గత సంవత్సరం జిల్లాలో మాతాశిశు ఆస్పత్రి(ఎంసీహెచ్) నిర్మాణంతో జిల్లాలో వైద్యసేవల్లో పూర్తిగా మార్పు చోటుచేసుకుంది.
- ఈ ఎంసీహెచ్‌కు మెదక్ జిల్లాతో పాటు కామారెడ్డి జిల్లాలోని గోపాల్‌పేట, నాగిరెడ్డిపేట, బిక్కనూర్ మండలాల నుంచి వైద్యసేవలకు వస్తున్నారు. వీరితో పాటు సంగారెడ్డి జిల్లా పరిధిలోని పలు మండలాలకు చెందిన మహిళలు ప్రసవాల కోసం వస్తున్నారు.



ఎంసీహెచ్, మెదక్

రక్తహీనత 19 శాతం

- జిల్లాలో గత నెలలో 1132 మంది గర్భిణులు రిజిస్ట్రేషన్ చేసుకోగా అందులో 237 మంది రక్తహీనతతో బాధపడ్డారు. ఇలాంటి వారికి ప్రత్యేకంగా ఐరన్ మాత్రలతో పాటు పలురకాల వైద్యం అందించి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.

ప్రసవాల్లో...

- గత మే నెలలో జిల్లాలోని అన్ని ప్రభుత్వాస్పత్రులతో పాటు ఎంసీహెచ్‌లో 82 శాతం ప్రసవాలు జరగ్గా, కేవలం 18 శాతం గర్భిణులు ప్రైవేట్ ఆస్పత్రుల్లో పురుడు పోసుకున్నారు. మొత్తంగా 732 మందికి డెలివరీ కాగా, ఇందులో 317 మందికి సిజేరియన్ చేశారు. ఈ లెక్కన నార్మల్ డెలివరీ శాతం 50.85గా నమోదైంది. ప్రైవేట్ ఆస్పత్రుల్లో 158 ప్రసవాలు జరగ్గా, ఇందులో కేవలం 25 మందికి మాత్రమే సాధారణ కాన్పులు అయ్యాయి. ఈ లెక్కన ప్రైవేట్ ఆస్పత్రుల్లోనే ఎక్కువగా సిజేరియన్లు అవుతున్నాయి. దీనిపై వైద్యాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆ రెండు జిల్లాల్లో..

- చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు, వ్యాక్సినేషన్‌తోపాటు వైద్యం అందించటంలో 83 శాతంతో సిద్దిపేట జిల్లా 9వ స్థానంలో నిలిచింది.
- సంగారెడ్డి జిల్లాలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు వ్యాక్సినేషన్‌తోపాటు వైద్యం అందించటంలో 58.9 శాతంతో 19వ స్థానంలో నిలిచింది.

పిల్లల వ్యాక్సినేషన్‌లో 101.8 శాతం

- మెదక్ జిల్లాలో గత మేనెలలో అప్పుడే జన్మించిన నవజాత శిశువుల నుంచి మొదలుకొని 5 ఏళ్లలోపు చిన్నారులతో పాటు తల్లులకు 101.8 శాతం వ్యాక్సినేషన్ అందిండం ద్వారా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. జిల్లావ్యాప్తంగా 1,696 మందిపిల్లలు ఉండగా 1,695 మందికి వ్యాక్సినేషన్‌తో పాటు అన్ని రకాల వైద్యసేవలు అందించారు. మరో చిన్నారికి ఆరోగ్య సమస్యల కారణంగా వ్యాక్సిన్ వేయలేదని ఓ ఉన్నతాధికారి తెలిపారు.
- మొదటి వ్యాక్సిన్ వేయాల్సిన చిన్నారులు, తల్లులు జిల్లాలో 1,681 మంది ఉండగా, 1,669 మందికి వేశారు.
- రెండవ వ్యాక్సిన్ 1,718 మందికిగాను 1676 మందికి వేశారు.
- మూడవ వ్యాక్సినేషన్‌లో భాగంగా 1519 మందికి వేయాల్సి ఉండగా, 1489 మందికి వేశారు.
- నాలుగో వాక్సినేషన్ 3751 మంది చిన్నారులకు వేయాల్సి ఉండగా 3749 మందికి వేశారు.

అందరి కృషితోనే..



జిల్లాను మొదటిస్థానంలో నిలపడంలో అందరి కృషి ఉంది. ఎప్పటికప్పుడు వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు సమీక్షలు చేయడం, వారి సలహాలు, సూచనలు, ఆదేశాలు తూచ తప్పకుండా పాటించటంతోనే ఇది సాధ్యమైంది. ముందు సైతం ఇదే విధంగా ముందుకు సాగుతాం.

– చందూనాయక్
జిల్లా వైద్యాధికారి

20లోగా దరఖాస్తు చేసుకోవాలి

బీసీ కుల,చేతివృత్తుల వారికి రూ.లక్ష ఆర్థికసాయం: కలెక్టర్ రాజర్షిషా



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: బీసీ కుల, చేతివృత్తుల వారికి రూ.లక్ష ఆర్థికసాయం అందజేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అర్హులైనవారు ఈనెల 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం సంగారెడ్డి నుంచి రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు, హైదరాబాద్ నుంచి బీసీసంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్, సీఎస్ శాంతికుమారిలు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ రాజర్షిషా మాట్లాడారు. బీసీ కుల, చేతి వృత్తులవారు ఆన్‌లైన్‌లో బుధవారం సాయంత్రంవరకు చేసిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. జూన్ 9న సీఎం కేసీఆర్ లాంఛనంగా ప్రారంభిస్తారని, జూన్ 20 వరకు దరఖాస్తులు స్వీకరించిన తర్వాత విచారణ చేపట్టడతారన్నారు. ప్రతినెలా దశలవారీగా లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందజేస్తారన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జూన్ 9న సంక్షేమ సంబురాల సందర్భంగా లబ్ధిదారుల గుర్తింపు, పంపిణీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తగా చేపట్టాలన్నారు. రెండోవిడత గొర్రెల పంపిణీ, ఇళ్ల పట్టాల పంపిణీ, బీసీ కులవృత్తులకు ఆర్థిక సాయం, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేపట్టాలని అధికారులకు సూచించారు. వైద్యశాఖలో పనిచేసే మహిళాఉద్యోగులకు చీరలు పంపిణీ చేయాలని, ఏఎన్ఎంలకు బీపీయంత్రాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, వెంకట శైలేష్, శ్రీనివాస్, బ్రహ్మాజీ పాల్గొన్నారు.

చెరువుల పండగను విజయవంతం చేయాలి

కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: అధికారులు టీం స్పిరిట్‌తో పని చేసి ఊరూరా చెరువుల పండగను విజయవంతం చేయాలని కలెక్టర్ రాజర్షిషా అధికారులకు సూచించారు. బుధవారం ట్యాంక్ ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. చెరువుల (ట్యాంక్) ప్రత్యేకాధికారులు రాత్రి అక్కడే బసచేసి సభాస్థలికి అనుకూలంగా చదును చేసి, లైటింగ్, డీజే సౌండ్ ఏర్పాటు చేయాలన్నారు. కట్టమైసమ్మ వద్ద పూజలు నిర్వహించాలన్నారు. మంచినీటి సౌకర్యం, రాత్రి భోజనం ఏర్పాటుకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి చెరువు వద్ద రెండు నుంచి నలుగురు గజ ఈతగాళ్లను నియమించామన్నారు. ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను గురువారం కలెక్టరేట్ ఆవరణలో ఉదయం 11 గంటలకు ప్రారంభిస్తున్నామన్నారు. 9,10 తేదీల్లో ద్వారకా గార్డెన్ లో ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ ఉంటుందన్నారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో చెరువుల పండగను ఘనంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని కమిషనర్లను కలెక్టర్ ఆదేశించారు.

వందశాతం పిల్లలను బడిలో చేర్పించాలి

కౌడిపల్లి(నర్సాపూర్): పిల్లలందరిని బడిలో చేర్పించాలని డీఈఓ రాధాకిషన్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన కౌడిపల్లి ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలతో పాటు వెల్మకన్న ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉపాధ్యాయులు నిర్వహించిన బడిబాటలో ఇప్పటివరకు ఎంతమంది పిల్లలను బడిలో చేర్పించారన్న విషయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ బడీడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పిస్తున్నారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి 1వ తరగతికి వచ్చేవారు. ప్రాథమిక పాఠశాలల నుంచి 6వ తరగతి చేరే విద్యార్థులను గుర్తించి బడిలో చేర్పిస్తున్నారన్నారు. అన్ని గ్రామాలలో వందశాతం పిల్లలను గుర్తించి ఆయా తరగతులలో చేర్పించాలన్నారు. ఈనెల 12న పాఠశాలల ప్రారంభ సందర్భంగా మామిడి తోరణాలు, ముగ్గులతో అందంగా అలంకరించి పండగ వాతవరణంలో పాఠశాలలను ప్రారంభించాలన్నారు. 7న బాలిక విద్యపై కెరీర్ గైడెన్స్ నిర్వహించి విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తామన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 20న విద్యాదినోత్సవం నిర్వహించడంతోపాటు మనఊరు–మనబడిలో పనులు పూర్తయిన పాఠశాలలను ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బుచ్చానాయక్, కౌడిపల్లి, వెల్మకన్న హెచ్‌ఎంలు సరోజ, రాధాకిషన్, స్వరూపరాణి, వెల్మకన్న సర్పంచ్ కాజీపేట రాజేందర్, కౌడిపల్లి ఉపసర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, వార్డు సభ్యుడు తిరుమలేష్, అంగన్‌వాడీ టీచర్ ప్రవళిక, ఎస్ఎంసీ చైర్మన్ జగన్, అంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బడిబాటలో డీఈఓ రాధాకిషన్

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రమేష్

మెదక్ కలెక్టరేట్: ఈనెల 12 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించే ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ రమేష్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఉదయం, మధ్యాహ్నం నిర్వహించే పరీక్షలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అనుబంధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 4,227 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 2,454 మంది హాజరవుతారన్నారు. ఇందుకోసం జిల్లాలో 23 కేంద్రాలను ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని, 23 చీఫ్ సూపరింటెండెంట్లు , 23 శాఖాధికారులతో పాటు ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్, 4 సిట్టింగ్ స్క్వాడ్, 4 కస్టోడియన్స్ టీములు ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సత్యనారాయణ, డీఈఓ రాధాకిషన్, రామేశ్వర్‌రావు, డాక్టర్ నవీన్ , పోలీసు, పోస్టల్, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

'డబుల్' దందాపై ఆగ్రహం

- అనర్హులకు ఇళ్లు ఇచ్చారంటూ తాళాలు
- రామతీర్థంలో దళిత మహిళల ఆందోళన



దళిత మహిళలు తాళం వేసిన డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇదే

పాపన్నపేట(మెదక్): నిరుపేదలకు అందాల్సిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు అనర్హులకు అందాయని ఆగ్రహం వ్యక్తం చేస్తూ, సంబంధితులకు కేటాయించిన ఇళ్లకు దళిత మహిళలు తాళాలు వేశారు. ఆపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన సంఘటన మండల పరిధిలోని రామతీర్థంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. రామతీర్థంలో ప్రభుత్వం రూ.3.85 కోట్ల వ్యయంతో 56 డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఈనెల 5న మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఇందులో 23 ఇళ్లు ఎస్సీలకు, 3 ఎస్టీలకు, 30 ఇతర వర్గాల వారికి కేటాయించారు. ఇందులో అధికార పార్టీనేతలు, వారి బంధువులు, స్థానికేతరులు, భూస్వాములు కేటాయించారని బాధిత మహిళలు ఆరోపించారు. కొందరు నేతలు రూ. 10 నుంచి 50వేల వరకు డబ్బు తీసుకున్నారని ఆరోపించారు. ఆ తర్వాత అనర్హుల ఇళ్ల కేటాయించారంటూ కొన్నింటికి తాళాలు వేశారు. ఆపై ఆగ్రహంతో కొన్ని ఇళ్ల కిటికీలు కూడా పగులగొట్టారు. అక్కడే బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆందోళన చేస్తున్న దళిత మహిళలను స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సిలింగ్ చేసి వదిలిపెట్టారు.



పాపన్నపేట పోలీస్ స్టేషన్‌లో ఆందోళన చేసిన మహిళలు

కలియుగ భగీరథుడు కేసీఆర్

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): రాష్ట్రంలో సాగునీటి ప్రగతి సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమైందని, ఆయన కలియుగ భగీరథుడని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని అజ్జమర్రిలో నీటిపారుదలశాఖ ఆధ్వర్యంలో సర్పంచ్ పరుశరాంరెడ్డి అధ్యక్షతన దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సాగునీటి ప్రగతి కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సునీతారెడ్డి, ఎమ్మెల్యే మదన్ రెడ్డి, కలెక్టర్ రాజర్షిషాలకు గ్రామస్తులు బోనాలు, నృత్యాలతో ఊరేగిస్తూ ఘనస్వాగతం పలికారు. రూ.7.4 కోట్లతో నిర్మించిన అజ్జమర్రి చెక్‌డ్యాంను ఈ సందర్భంగా వారు ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ ప్రభుత్వం సాధించిన ప్రగతి భవిష్యత్ తరాలకు తెలిసేలా ఉందన్నారు. నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చొరవతో నియోజకవర్గంలో 14 చెక్‌డ్యాంలు ఏర్పాటు చేశామని, చిలప్‌చెడ్ గ్రామానికి మరో చెక్‌డ్యాం మంజూరు చేయిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, రిటైర్డ్ ఇరిగేషన్ ఈసీ మల్లయ్య, ఈఈ శ్రీనివాసరావు, ఏఈలు విక్రమ్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, ఎంపీపీ వినోదరెడ్డి, ఎంపీడీఓ శశిప్రభ, తహసీల్దార్ ముసాద్దిక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అజ్జమర్రి చెక్‌డ్యాం వద్ద పూజల్లో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, కలెక్టర్ రాజర్షిషా తదితరులు

రైతు బాంధవుడు కేసీఆర్

మెదక్ రూరల్: అన్నదాతలకు అనేక సంక్షేమ పథకాలను చేరువ చేసిన సీఎం కేసీఆర్ రైతు బాంధవుడిగా నిలిచారని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలపరిధిలోని ర్యాలమడుగు చెక్ డ్యాం వద్ద నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో సాగు నీటి దినోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి, అదనపు కలెక్టర్ రమేష్‌లతో కలిసి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణలో 70 ఏళ్లలో జరగని అభివృద్ధి తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనలో సాధ్యమైందన్నారు. గతంలో సింగూర్ ప్రాజెక్ట్ నుంచి ఘనపూర్ ప్రాజెక్ట్‌కు సాగునీరు కావాలంటే అప్పటి ఎమ్మెల్యేలకు దండం పెట్టి బతిమిలాడాల్సిన పరిస్థితులు ఉండేవని, కానీ ఇప్పుడు పూర్తిగా పరిస్థితులు మారిపోయామన్నారు. ఈ కార్యక్రమంలో ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ ఏసయ్య, డీఈ నాగరాజు, ఎంపీపీ యమునా జయరాం రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, సర్పంచ్ రజినిభిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.



సాగునీటి ప్రగతి పుస్తకావిష్కరణలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఎమ్మెల్సీ సుభాశ్‌రెడ్డి, అదనపు కలెక్టర్ రమేష్ తదితరులు

విగ్రహ ప్రతిష్ఠ గొప్ప కార్యక్రమం

చేగుంట(తూప్రాన్): మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన వేణుగోపాలస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు హాజరై ఉత్సవ విగ్రహాల ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పురాతన కృష్ణుడి ఆలయాన్ని నూతనంగా నిర్మించి విగ్రహ ప్రతిష్ఠకార్యక్రమాలు ప్రారంభించడం గొప్ప విషయమన్నారు. ఉత్సవాల్లో భాగంగా పుణ్యాహవచనం, వాస్తు, ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ సర్పంచు రాజగోపాల్ బీజేపీ నాయకులు భూపాల్, గోవింద్, గణేష్‌రవికుమార్, హరిశంకర్, ఉత్సవకమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో ఎమ్మెల్యే రఘునందన్‌రావు

క్లుప్తంగా

యువకుడిపై పీడీ యాక్ట్



అశోక్‌ను జైలుకు తరలిస్తున్న సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ సుభాష్‌గౌడ్

చిన్నశంకరంపేట(మెదక్‌): అమాయక బాలికలను టార్గెట్‌ చేస్తూ లైంగిక దాడులకు పాల్పడుతున్న యువకుడిపై పీడీ యాక్ట్‌ నమోదు చేసి, చంచల్‌గూడ జైలుకు తరలించినట్లు మెదక్‌ జిల్లా ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని అన్నారు. మండలంలోని గవ్వలపల్లి గ్రామానికి చెందిన కొండగల్ల అశోక్‌(22) కళాశాల విద్యార్థిగా తోటి విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేస్తూ ఇప్పటికే ఇద్దరు బాలికలపై లైంగిక దాడికి పాల్పడగా, పోక్సో కేసులు రెండు నమోదు చేసినట్లు రామాయంపేట సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, చిన్నశంకరంపేట ఎస్‌ఐ సుభాష్‌గౌడ్‌ తెలిపారు. యువకుడిని అరెస్ట్‌ చేసి చంచల్‌గూడ జైలుకు తరలించినట్లు తెలిపారు. జిల్లాలో ఎవరైనా శాంతి భద్రతకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అనుమానిత వ్యక్తి పోలీసులకు అప్పగింత

నర్సాపూర్‌: పట్టణంలో రాత్రిపూట అనుమానంగా తిరుగుతున్న వ్యక్తిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. నాలుగో వార్డులోని శివాజీ విగ్రహం సమీపంలో మంగళవారం అర్ధరాత్రి ఒకరు అనుమానంగా తిరగడాన్ని కొందరు యువకులు గుర్తించి అతన్ని పట్టుకున్నారు. వివరాలు అడగ్గా సరైన సమాధానం రాకపోవడంతో పాటు అతని వద్ద నంది విగ్రహం ఉండడంతో అతనిపై అనుమానాలు కలిగి 100 నంబర్‌కు ఫోన్‌ చేశారు. పోలీసులు రాగానే వారికి అతడిని అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో అక్కాతమ్ముడికి గాయాలు



ఆస్పత్రికి క్షతగాత్రుల తరలింపు

న్యాల్‌కల్‌(జహీరాబాద్‌): రోడ్డు ప్రమాదంలో అక్కాతమ్ముడికి తీవ్రగాయాలయ్యాయి. మండల పరిధిలోని కల్బెమల్‌ గ్రామానికి చెందిన శోభ ఆమె తమ్ముడు రాజులు బుధవారం మునిపల్లి మండలం పెద్దలోడి గ్రామంలో జరిగిన వివాహానికి హాజరై తిరిగి బైక్‌పై స్వగ్రామానికి వస్తున్నారు. ఈక్రమంలో రుక్మాపూర్‌ గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో వారు బైక్‌ పై నుంచి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో జహీరాబాద్‌ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మల్లన్నకుంట కబ్జాపై విచారణ

అక్కన్నపేట(హుస్నాబాద్‌): మల్లంపల్లి– చౌటపల్లి గ్రామాల శివారులోని మల్లన్నకుంట కబ్జాపై రెవెన్యూ, ఇరిగేషన్‌ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. మంగళవారం వివిధ పత్రికల్లో వచ్చిన వార్త కథనాలకు అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా బుధవారం రెవెన్యూ, ఇరిగేషన్‌ శాఖ అధికారులు కలిసి కుంటను సందర్శించి పరిశీలించారు. రెవెన్యూ శాఖ నుంచి తహసీల్దార్‌ సంజీవ్‌కుమార్‌, ఆర్‌ఐ రాజు, సిబ్బంది కలిసి వెళ్లి, రైతు దగ్గర ఉన్న పూర్తి ఆధారాలను వెంటతీసుకొని రెవెన్యూ కార్యాలయానికి రావాలని ఆదేశించారు. దీంతో అమ్మిన రైతు, కొనుగోలు చేసిన వ్యక్తిని రాత్రి వరకు రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. ఇరిగేషన్‌శాఖ ఏఈ రమ్యశ్రీ ఉపేందర్‌పై అక్రమంగా కుంట కట్టను ధ్వంసం చేసి ఆక్రమించాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తాండ్ర వివేక్‌ తెలిపారు.

సింగూరు చేపతో ‘మృగశిర’

- చేపలతో నోరూరించే వంటకాలు
- వంటలు చేస్తూ ఉపాధి పొందుతున్న కుటుంబాలు
- మత్స్యకారులకు చేతినిండా పని



సింగూరు ప్రాజెక్టు వద్ద చేపల విక్రయాలు

పుల్‌కల్‌(అందోల్‌): మృగశిర కార్తె వచ్చిందంటే సింగూరు చేపలకు భలే గిరాకీ. ఈ రోజు సింగూరు చేపలతో చేసిన కూర రుచి చూస్తే ఏడాదంత ఆరోగ్య సమస్యలు తలెత్తవని, ముఖ్యంగా జలుబు వంటి వ్యాధులు దరిచేరవని ప్రజల నమ్మకం. అంతే కాకుండా ప్రాజెక్టుకు వచ్చే పర్యాటకులకు చేపలతో విందు భలే పసందుగా ఉంటుంది. పర్యాటకులు చేపలతో చేసిన విందుకు తహతహలాడుతుంటారు. చేపలు అంతటా దొరుకుతున్నా సింగూరు డ్యాంలో దొరికే చేపకు రుచే వేరని కితాబిస్తుంటారు.

- మృగశిర కార్తె నాడు లక్షల్లో చేపల వ్యాపారం జరుగుతుంది. సంగారెడ్డి, సదాశివపేట, జోగిపేట, మునిపల్లి, పుల్‌కల్‌ మండలాలు కాకుండా సింగూరు పరీవాహకం చుట్టు పక్కల ఉన్న నారాయణఖేడ్‌, మనూరు, న్యాల్‌కల్‌, రాయికోడ్‌ తదితర గ్రామాల ప్రజలు ఈ చేపలతో రకరకాల వంటలు చేస్తుంటారు.
- సింగూరు డ్యామ్‌ మంజీరా నదిపై నిర్మించారు. ఈనది పరీవాహక ప్రాంతం మెట్ట భూములతో నిండి ఉండటం, మహారాష్ట్రలోని పర్వత శ్రేణుల్లో నుంచి వస్తుండటంతో మంజీరా నదిలో మినరల్‌ శాతం ఎక్కువగా ఉంటాయి. అందువల్ల మంజీరా నదిపై నిర్మించిన సింగూరు డ్యామ్‌లో ఉత్పత్తి అయ్యే చేపలు రుచికరంగా ఉంటాయని జివ్హ చాపల్యం ఉన్న వారు ఉవ్విళ్లూరుతుంటారు.
- జిల్లాలో ఎకైక భారీ ప్రాజెక్టు సింగూరు కావడంతో మత్స్యకారులు చేపల వృత్తిని జీవనాధారంగా చేసుకుని ఉపాధి పొందుతున్నారు. దీనికి తోడు మత్స్యశాఖ చేపల ఉత్పత్తికి ప్రాధాన్యత ఇవ్వడంతో సింగూరు డ్యాంలో చేపల ఉత్పత్తికి ప్రాముఖ్యత ఏర్పడింది. డ్యాం ఎగువన మంజీరా నది పరీవాహకంపై 20 కిలోమీటర్ల మేర విస్తరించడంతో చేపల ఉత్పత్తికి డిమాండ్‌ పెరిగింది. ఈ డ్యాంలో నాలుగు రకాల చేపలు పెరుగుతున్నాయి. కొర్రమీను, తెల్లచేప, బొచ్చ వంటి చేపలు అందుబాటులో ఉన్నాయి.
- సింగూరు డ్యాంలో ప్రభుత్వం ఏటా 60 లక్షల పైచిలుకు చేప పిల్లలను విడుదల చేస్తున్నాయి. దీనికి తోడు సహజంగా ఉత్పత్తి అయ్యే చేపలు అదనం. దీంతో లక్షల సంఖ్యలో చేపలు పెరుగుతున్నాయి. డ్యాం పరీవాహక ప్రాంతం ఎక్కువగా ఉండటం, స్వచ్ఛమైన నీరు ఉండటం, చేపలు ఈదటానికి 20 కిలోమీటర్ల మేర పరీవాహక ప్రాంతం కలిగి ఉండటంతో చేపలు నాణ్యతతో పెరుగుతున్నాయి. దీంతో సింగూరు చేప రుచికరంగా ఉంటుందనేది అభిప్రాయం.
- సింగూరు ప్రాజెక్టు ఎగువ, దిగువ గ్రామాలలో ప్రభుత్వం గుర్తించిన మత్స్యకారులున్నాయి. వందల సంఖ్యలో ఉన్న ఈ మత్స్యకారులు సింగూరు డ్యాంపైనే ఆధారపడి చేపలు పట్టుకుంటూ ఉపాధి పొందుతున్నారు. అంతేకాకుండా ప్రభుత్వం చేపలు పట్టడానికి అవసరమైన వలలు, వాహనాలు, క్రమ విక్రయాల సామగ్రి రాయితీపై అందిస్తుండటంతో వాటిని సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందుతున్నారు.
- సింగూరు జలాశయంలో వివిధ రకాల చేపలు పెరుగుతున్నాయి. ఈ చేపలతో రుచిరకమైన వంటలు చేస్తూ పర్యాటకులకు పసందైన విందును అందించటానికి డ్యాం సమీపంలో కొన్ని కుటుంబాలు గుడారాలు వేసుకున్నాయి.
- రోజుకు టన్నుల కొద్ది చేపలతో రుచికరమైన వంటలు చేస్తున్నారు. సింగూరు జలశయంలో చేపలు పట్టే మత్స్యకారులతో పాటు, రుచికరమైన వంటలు చేస్తూ మరి కొన్ని కుటుంబాలు ఉపాది పొందుతున్నాయి.



చేపలతో వంటకాలు

చేపకూరలతో మృగశిరకు స్వాగతం



మృగశిరకార్తె రోజు చేపలు తినాలని ఆనవాయితీ ఉంది. ఈరోజు ప్రతీ ఇంటిలో చేపలతో ప్రత్యేక వంటలు చేస్తాం. సింగూరు చేపలు రుచికరంగా ఉండటంతో వీటికి మంచి డిమాండ్‌ ఉంది. ఈకార్తె నాడు చేపలతో పలురకాల వంటకలు చేస్తాం. సింగూరు చేపలంటే కుటుంబ సభ్యులు బాగా ఇష్టపడతారు.

– సత్యనారాయణ, ముద్దాయిపేట

చికిత్స పొందుతున్న ముగ్గురి మృతి

అప్పులు తీర్చలేక ఆత్మహత్యకు యత్నించిన ఇద్దరు, రోడ్డు ప్రమాదంలో గాయపడిన మరొకరు చికిత్స పొందుతూ మృతి చెందారు.

అప్పులు తీర్చే మార్గం కనిపించక...



వేణు(ఫైల్‌)

కొండపాక(గజ్వేల్‌): ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ముంద్రాతి వేణు(28) మృతి చెందినట్లు కుకునూరుపల్లి ఎస్‌ఐ పుష్పరాజ్‌ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. కొడకండ్ల గ్రామానికి చెందిన ముంద్రాతి రాములు రెండో భార్య కుమారుడు వేణు ప్రైవేట్‌ జాబ్‌ చేసేవాడన్నారు. అతనికి 4 నెలల కిందట వివాహమైందని, దీంతో తెలిసిన వారి వద్ద అప్పులు చేశాడని తెలిపాడు. అప్పులు తీర్చే విషయంలో మదనపడుతూ ఈనెల 5వ తేదీ సాయంత్రం పురుగుల మందు తాగి ఇంటికి వచ్చి పడిపోయాడు. వెంటనే గజ్వేల్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచనల మేరకు వంటిమామిడి సమీపంలోని లక్ష్మక్కపల్లిలో గల ఆర్వీఎం ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడన్నారు. ఈ మేరకు మృతుని తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడి

మునిపల్లి(అందోల్‌): చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ రాజశేఖర్‌ కథనం ప్రకారం మండల పరిధిలోని తాటిపల్లి గ్రామానికి చెందిన సార విఠల్‌ మేకలకు మేత తేవడానికి గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలానికి లూనాపై వెళ్లాడు. లూనాను రోడ్డు పక్కన నిలిపి వస్తుండగా, రాయికోడ్‌ మండలానికి చెందిన ఒకరు అతివేగంగా వచ్చి సార విఠల్‌ను ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలైన విఠల్‌ను కుటుంబ సభ్యులు సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు జగన్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు...

సిద్దిపేటఅర్బన్‌: సిద్దిపేటలోని రంగధాంపల్లి గ్రామానికి చెందిన రాగం రఘు (58) వ్యవసాయంలో సరైన దిగుబడి లేకపోవడం, ఇటీవల కురిసిన అకాల వర్షానికి పంట నష్టం జరగడంతో మనో వేదనకు గురయ్యాడు. మంగళవారం సాయంత్రం వ్యవసాయ బావి వద్దకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి పురుగుల మందు తాగాడు. రాత్రయినా ఇంటికి రాలేదు. ఫోన్‌ చేయగా స్విచ్‌ఆఫ్‌ వచ్చింది. దీంతో కుమారుడు సాయికుమార్‌ బావి వద్దకు వెళ్లి చూడగా కిందపడిపోయి ఉన్నాడు. వెంటనే సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మరణించాడు. మృతుడి కుమారుడు సాయికుమార్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు సిద్దిపేట త్రీటౌన్‌ సీఐ భానుప్రకాశ్‌ తెలిపారు.

దేవతల కుచ్చెలో తవ్వకాలు



కిందపడి ఉన్న కాలబైరవ విగ్రహం

టేక్మాల్‌(మెదక్‌): దేవతల కుచ్చెలో గుప్తనిధుల కోసం కొందరు తవ్వకాలు జరిపారు. ఈ ఘటన మండలపరిధిలోని వెల్పుగొండలో బుధవారం ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని తుంబురీశ్వరాలయ ప్రాంగణంలోని చెరువు మధ్యలో ఉన్న దేవతల గుట్ట(కుచ్చె)లో గంబర కాలబైరవుని విగ్రహం కొలువై ఉంది. వారంరోజుల క్రితం గ్రామస్తులు తుంబురీశ్వర ఆలయంలో రాత్రి భక్తులు భజన చేస్తుండగా దేవతలకొండపై లైట్లు వెలగడాన్ని గమనించారు. విషయం ప్రజాప్రతినిధులు చెప్పగా, అందరూ అక్కడకు వెళ్లి చూడగా దుండగులు పరారయ్యారు కాలబైరవుడి విగ్రహాన్ని తవ్వి పక్కన పెట్టారు. పెద్దపెద్ద తాళ్లు, కట్టెలు, తెల్లటి దోతులు, రాళ్లు పగులగొట్టె నుక్కులు ఉన్నాయి. దీనిని బట్టి చూస్తే ఆ విగ్రహాన్ని తరలించడానికి ప్రయత్నించారు. గ్రామస్తులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

గొంతు కోసి.. గొలుసు ఎత్తుకెళ్లి



లింగవ్వ మృతదేహం

సిద్దిపేటరూరల్‌: గొలుసు కోసం ఓ వృద్ధురాలి గొంతు కోసి హత్య చేశారు. చిన్నకోడూరు ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం... నారాయణరావుపేట మండల పరిధిలోని గుర్రాలగొంది గ్రామంలో బాలగోని లింగవ్వ (80) ఇంటి వద్దనే ఉంటుండగా, ఆమె బాగోగులను గ్రామంలోని బంధువైన కలవ్వ చూసుకుంటోంది. రోజు మాదిరిగానే కలవ్వ బుధవారంఉదయం టిఫిన్‌ ఇచ్చి వెళ్లింది. సాయంత్రం సమయంలో ఇంటికి వచ్చి చూడగా లింగవ్వ రక్తపు మరకలతో మంచంపై పడి ఉండడాన్ని గమనించింది. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి మెడలోని బంగారు గొలుసును లాక్కునే ప్రయత్నం చేయడంతో తోపులాట జరిగింది. దీంతో దుండగులు అక్కడే ఉన్న కొడవలితో వృద్ధురాలి గొంతుకోసి గొలుసును అపహరించారు. మెడపై కొడవలితో దాడి చేయడంతో తీవ్ర రక్తస్రావమైన లింగవ్వ అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న సీఐ జానకిరాంరెడ్డి, ఎస్‌ శివానందంలు వివరాలు సేకరించారు. అనంతరం క్లూస్‌ టీం సిబ్బందికి సమాచారం అందించగా, వేలిముద్రలు, ఆనవాళ్లు చేశారు. ఈ ఘటనపై స్టేషన్‌లో కేసు నమోదు కాలేదు.

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

కొడుకు సంసారం బాగా లేదని ఓ తండ్రి, భర్తతో గొడవ పడి ఓ భార్య, అనారోగ్యంతో బాధపడుతూ మరొకరు వేర్వేరు చోట్ల ఆత్మహత్య చేసుకున్నారు.

కొడుకు సంసారం బాగా లేదని...



యాదగిరి మృతదేహం

కొండపాక(గజ్వేల్‌): కొడుకు సంసారం బాగాలేదని మనస్తాపానికి గురై తండ్రి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గజ్వేల్‌ మండలంలో చోటు చేసుకుంది. కుకునూరుపల్లి ఎస్‌ఐ పుష్పరాజ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. కొడకండ్ల గ్రామానికి చెందిన పిట్ల భూపాల్‌కు 3 ఏళ్ల కిందట వివాహమైంది. వివాహం అయిన కొద్ది రోజులకు భూపాల్‌ భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి రాలేదు. ఈ విషయంలో పలుమార్లు పంచాయతీ పెట్టినా భార్య సంసారానికి రాలేదు. దీంతో కొడుకు సంసారం బాగుపడటం లేదని తండ్రి యాదగిరి(70) మనో వేదనకు గురయ్యేవాడు. ఈ క్రమంలో గ్రామంలోని డబుల్‌ బెడ్రూం వద్ద చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కొడుకు భూపాల్‌ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అనారోగ్యంతో..

గజ్వేల్‌రూరల్‌: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని బయ్యారంలో చోటు చేసుకుంది. గజ్వేల్‌ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బయ్యారంలోని చర్చి కాలనీకి చెందిన బీరెడ్డి ఆంతోనిరెడ్డి(54)కి భార్య ధనలక్ష్మితో పాటు కూతురు ఉన్నారు. ఆంతోనిరెడ్డి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో బుధవారం ఇంట్లోని బాత్‌రూమ్‌లో నైలాన్‌ తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భర్తతో గొడవ పడి..

చిలప్‌చెడ్‌(నర్సాపూర్‌): భర్తతో గొడవపడి ఓ భార్య ఆత్మహత్య చేసుకుంది. బుధవారం స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గౌతాపూర్‌ గ్రామానికి చెందిన నదరి లక్ష్మి (38) భర్త భూమయ్య పని చేసుకుంటూ జీవనం సాగించేవారు. మంగళవారం ఉదయం దంపతుల మధ్య గొడవ జరగడంతో ఇంటి నుండి వచ్చిన లక్ష్మి చిలప్‌చెడ్‌ శివారులో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ విషయమై ఎస్‌ఐ మహ్మద్‌గౌస్‌ను వివరణ కోరగా మృతదేహాన్ని పరిశీలించామని, మృతురాలి కుటుంబసభ్యులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే పోస్టుమార్టంకు తరలిస్తామన్నారు.

విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని

మెదక్‌ మున్సిపాలిటీ: ప్రతి పోలీస్‌అధికారి తమ విధుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని మెదక్‌ ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని సూచించారు. బుధవారం జిల్లా పోలీస్‌ ప్రధాన కార్యాలయంలో జిల్లా సిబ్బందితో నెలవారీ నేర సమీక్షసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్‌ ఉన్న కేసులలో గ్రేవ్‌, నాన్‌ గ్రేవ్‌ కేసుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకొన్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ గ్రేవ్‌, నాన్‌ గ్రేవ్‌ కేసులలో ఇన్వెస్టిగేషన్‌ వివరాలు తెలిపారు. ప్రతి అధికారికి పూర్తి స్టేషన్‌ మేనేజ్‌మెంట్‌ తెలిసి ఉండాలన్నారు. అధికారులకు, సిబ్బందికి తరచు క్షణ తరగతులు నిర్వహించి వారి పనితనాన్ని మరింత మెరుగుపర్చాలన్నారు. ఈ సమావేశంలో తూప్రాన్‌ డీఎస్పీ యాదగిరి రెడ్డి, ఆర్‌ఐ నాగేశ్వర్‌రావుతోపాటు జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు.

బెస్ట్‌ అవైలబుల్‌కు 34 మంది విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను ఎంపిక చేస్తున్న అధికారులు

మెదక్‌ కలెక్టరేట్‌: బెస్ట్‌ అవైలబుల్‌ స్కీమ్‌ కింద 34మంది విద్యార్థులు ఎంపికయ్యారు. బుధవారం కలెక్టరేట్‌లో ట్రైబల్‌ వెల్ఫేర్‌ డిపార్ట్‌మెంట్‌ ఆధ్వర్యంలో లాటరీ ద్వారా విద్యార్థుల ఎంపిక చేశారు. ఎస్సీ కార్పోరేషన్‌ ఈడీ విజయలక్ష్మి, ఆర్డీఓ సాయిరాంలు పాల్గొని విద్యార్థుల ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. 3వ తరగతిలో 17 మంది, 5వ తరగతిలో 9 మంది, 8వ తరగతిలో 8 మందిని ఎంపిక చేశారు. ఇందులో బాలికలు 11మంది, బాలురు 23 మంది ఉన్నారు. కాగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

నకిలీ సీబీఐ అధికారుల అరెస్ట్‌



నిందితులతో పోలీసులు

కొండాపూర్‌(సంగారెడ్డి): మల్కాపూర్‌ చౌరస్తా వద్ద నకిలీ సీబీఐ అధికారులను కొండాపూర్‌ పోలీసులు అరెస్ట్‌ చేశారు. కొండాపూర్‌ ఎస్‌ కథనం ప్రకారం.. ఈనెల 2వ తేదీన మండల పరిధిలోని తేర్పోల్‌లో మధ్యాహ్నం 2 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన ప్రమీల తన కూతురు సిరి చందనతో కలిసి ఇంట్లో ఉంది. ఓ కారులో పురుషుడు, ఇద్దరు మహిళలు వచ్చి తాము సీబీఐ అధికారులమని పరిచయం చేసుకున్నారు. మీ ఇంటిని తనిఖీ చేయాలంటూ బలవంతంగా ఇంట్లో చొరబడ్డారు. ఇంట్లో సామాను చిందరవందరగా పడేశారు. దీంతో ప్రమీల మీరు ఎవరు? ఎందుకు ఇలా చేస్తున్నారని గట్టిగా ప్రశ్నించడంతో అందులో ఓ మహిళ ప్రమీల చెంపపై కొట్టింది. ప్రమీల అరవకుండా మరో మహిళ నోట్లో గుడ్డలు పెట్టి ఆమె మెడలోని మూడు తులాల బంగారు పుస్తెల తాడును గుంజుకొని పరారయ్యారు. ప్రమీల భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ఐదు రోజులుగా నిందితుల కోసం గాలిస్తున్న క్రమంలో బుధవారం మల్కాపూర్‌ చౌరస్తా వద్ద అనుమానస్పదంగా ఉన్న సాయిజాదవ్‌ను విచారించడంతో నేరం ఒప్పుకున్నాడు. అతడికి సహకరించిన అందోల్‌ మండలం బ్రాహ్మణపల్లికి చెందిన కారు డ్రైవర్‌ విఠల్‌, తేర్పోల్‌ గ్రామానికి చెందిన గౌస్‌, సదాశివపేట మండలం ఆత్మకూరు గ్రామానికి చెందిన వడ్డె లక్ష్మిని అరెస్ట్‌ చేశారు. నిందితుల నుంచి పుస్తెల తాడును స్వాధీనం చేసుకొని వారిని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మరికొంత మంది పరారీలో ఉన్నారని, వారిని త్వరలో పట్టుకుంటామని ఎస్‌ఐ వెల్లడించారు.

అపహరణ, హత్యాయత్నం కేసులో..

నలుగురి అరెస్ట్‌, రిమాండ్‌

పటాన్‌చెరు టౌన్‌: అపహరణ, హత్యాయత్నం కేసులో నలుగురు నిందితులను పటాన్‌చెరు పోలీసులు అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. బుధవారం సీఐ వేణుగోపాల్‌ రెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామానికి చెందిన అనంతమ్మ పటాన్‌చెరు గౌతంనగర్‌ కాలనీకి చెందిన శాంతమ్మ కుటుంబాలకు గత కొంతకాలంగా వికారాబాద్‌ జిల్లా నోవాపేటలో ఉన్న భూమి విషయంలో వివాదం నడుస్తోంది. తనకు కూడా ఆస్తిలో వాటా వస్తుందని శాంతమ్మ వికారాబాద్‌ సివిల్‌ కోర్టులో కేసు వేసింది. ఈనేపథ్యంలో రుద్రారం గ్రామానికి చెందిన అనంతమ్మ రెండో కుమారుడు శ్రీను గ్రామ శివారులో గీతం విశ్వవిద్యాలయం బాలికల వసతి గృహం వెనుక చెరువు పక్కన అనూహ్యంగా చనిపోయాడు. శాంతమ్మ భర్త నారాయణ భూవివాద నేపథ్యంలో హత్యచేశాడని శ్రీను కుటుంబ సభ్యులు కక్ష పెంచుకున్నారు. ఈ నేపథ్యంలో 6వ తేదీ సాయంత్ర సాకి చెరువు సమీపంలో ఉన్న సైకిల్‌ షాపు వద్ద నారాయణ సైకిల్‌ కు పంక్చర్‌ వేయించుకుంటున్నాడు. అదే సమయంలో కారులో మృతుడు శ్రీను తండ్రి కిష్టయ్య, సోదరుడు రాజు, వారి ఇంటి పక్కన ఉన్న రమేశ్‌, స్కూటీపై మరోసోదరుడు సత్తెయ్య, తల్లి అనంతమ్మ, భార్య సంతోష వచ్చి నారాయణపై దాడిచేసి ఎందుకు చంపావురా అంటూ అతడిని కారులో ఎత్తుకెళ్లి రుద్రారంలోని వారి ఇంటికి తీసుకెళ్లి నిర్బంధించారు. నారాయణను కట్టెలతో కొట్టి చంపుతామని బెదిరించారు. పోలీసులకు సమాచారం అందడంతో హుటాహుటిన ఘటనా స్థలానికి వెళ్లి నారాయణను కాపాడారు. నిందితులు రాజు, రమేశ్‌, సత్తెయ్య, సంతోషను అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఆన్‌లైన్‌లో బెదిరింపులు



సిద్దిపేటకమాన్‌: ఆన్‌లైన్‌లో ఓ లోన్‌ యాప్‌ ద్వారా తీసుకున్న డబ్బు చెల్లించినా కూడా మళ్లీ చెల్లించాలని గుర్తుతెలియని వ్యక్తి బెదిరింపులకు పాల్పడుతున్న సంఘటన హుస్నాబాద్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. సిద్దిపేట పోలీస్‌ కమిషనర్‌ ఎన్‌.శ్వేత తెలిపిన వివరాల ప్రకారం..

- హుస్నాబాద్‌ పరిధిలో ఓ వ్యక్తి లోన్‌యాప్‌ ద్వారా రూ.2,09,856 లోన్‌ తీసుకుని తిరిగి మొత్తం డబ్బు చెల్లించాడు. కానీ గుర్తు తెలియని వ్యక్తి బాధితుడికి ఫోన్‌ చేసి ఇంకా లోన్‌ డబ్బులు చెల్లించాలని లేదంటే బాధితుడి ఫొటోలు మార్ఫింగ్‌ చేసి సోషల్‌ మీడియాలో పోస్ట్‌ చేస్తానని బెదిరించాడు. దీంతో బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్‌ నెంబర్‌ 1930కు ఫిర్యాదు చేశాడు.

ఇన్‌స్టాగామ్‌లో ఫోన్‌ ఆర్డర్‌ చేసి

- గజ్వేల్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని ఓ వ్యక్తి ఇన్‌స్టాగామ్‌లో రూ.10వేలు చెల్లించి ఓ మొబైల్‌ ఫోన్‌ను ఆర్డర్‌ చేశాడు. తర్వాత అందులో ఉన్న ఫోన్‌ నెంబర్‌కు ఫోన్‌ చేయగా స్పందించ లేదు. దీంతో తను మోసపోయినట్లుగా గుర్తించి జాతీయ హెల్ప్‌లైన్‌ నెంబర్‌కు ఫిర్యాదు చేశాడు.

ఫ్లిప్‌కార్డ్‌ పేరుతో

- గజ్వేల్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో ఓ వ్యక్తి సెల్‌ఫోన్‌కు తన ఖాతా నుంచి రూ.7,780 ఫ్లిప్‌కార్డ్‌ పేరుతో డబ్బులు డెబిట్‌ అయినట్లు మెసేజ్‌ వచ్చింది. బాధితుడు వెంటనే ఫ్లిప్‌కార్డ్‌ కస్టమర్‌ కేర్‌ నంబర్‌కు ఫోన్‌ చేయగా వారు పరిశీలించి బాధితుడి ఖాతా హ్యాక్‌ అయినట్లు తెలిపారు.
- చిన్నకోడూర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని ఓ వ్యక్తి సెల్‌ఫోన్‌కు ఫాస్ట్‌ వాలెట్‌ లోన్‌ యాప్‌ ద్వారా డబ్బులు వచ్చినట్లు మెసేజ్‌ వచ్చింది. అది నిజమా ? కాదా ? అని బాధితుడు ఆ లింకును ఓపెన్‌ చేయగా రూ.2వేలు ఖాతాలో జమ అయినట్లు, ఈఎంఐ చెల్లించాలని మెసేజ్‌ ఉంది. తర్వాత గుర్తు తెలియని వ్యక్తి ఫోన్‌ చేసి హిందీలో అసభ్యకరంగా మాట్లాడుతూ డబ్బులు చెల్లించకపోతే అతడి, కుటుంబ సభ్యుల ఫొటోలు మార్ఫింగ్‌ చేసి సోషల్‌ మీడియాలో పోస్ట్‌ చేస్తానని బెదిరించాడు. దీంతో బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్‌ నెంబర్‌ 1930కు ఫిర్యాదు చేశాడు.

ప్రైవేటు ఉద్యోగికి రూ.6.85 లక్షలకు టోకరా

పటాన్‌చెరు టౌన్‌: ఆన్‌ లైన్‌ యూట్యూబ్‌ లింకులు క్లిక్‌ చేస్తే నగదు వస్తుందని, అదేవిధంగా టాస్కులు పూర్తి చేస్తే 30 శాతం కమీషన్‌ ఇస్తామని ఆశ చూపి సైబర్‌ మోసగాళ్లు ఓ ప్రైవేటు ఉద్యోగిని మోసం చేశారు. ఈ సంఘటన బీడీఎల్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రామచంద్రాపురం పరిధిలోని విలమేలకు చెందిన రాయిశెట్టి వేణు ప్రైవేటు ఉద్యోగి. మే 22 వ తేదీన అతడి వాట్సాప్‌ నంబర్‌కు ఆన్‌లైన్‌ లింక్‌ క్లిక్‌ చేస్తే నగదు ఇస్తామంటూ మెసేజ్‌ వచ్చింది. దీంతో బాధితుడు తన వివరాలను నమోదు చేశాడు. అపరిచితులు చెప్పిన విధంగా ముందుగా రూ.2 వేలు నగదు పెట్టుబడి పెట్టగా రూ.2800 ఇచ్చారు. అనంతరం టాస్కులు పూర్తి చేస్తే 30% కమీషన్‌ ఇస్తామని ఆశ చూపగా బాధితుడు పలు దఫాలుగా రూ.6.85 లక్షలు పంపాడు. బాధితుడు తను ఇన్వెస్ట్‌ చేసిన నగదుతో కమీషన్‌ ఇవ్వమని అడగడంతో వారు స్పందించ లేదు. దీంతో తాను మోసపోయినట్లు బాధితుడు గ్రహించి ముందుగా సైబర్‌ పోలీసులకు, అనంతరం బీడీఎల్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్‌ వలలో ఇద్దరు గృహిణులు

పటాన్‌చెరు టౌన్‌: అమీన్‌పూర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో ఇద్దరు మహిళలు సైబర్‌ వలో చిక్కుకుని మోసపోయారు.

- అమీన్‌పూర్‌కు చెందిన ఓ మహిళకు మే 25వ తేదీన పార్ట్‌ టైం జాబ్‌ ఆఫర్‌ అంటూ మెసేజ్‌ వచ్చింది. దీంతో ఆ మహిళ వివరాలు నమోదు చేసి నగదు పెడుతూ ఇచ్చిన టాస్కులు చేస్తూ వచ్చింది. చివరికి ఆ మహిళ తాను పెట్టిన రూ.57,800లకు రెట్టింపైన నగదును ఇవ్వాలని అడగగా స్పందన రాలేదు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్‌ క్రైమ్‌లో పాటు ఆమీన్‌పూర్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.
- అమీన్‌పూర్‌ పరిధిలోని కేఎస్‌ఆర్‌ కాలనీకి చెందిన మహిళకు మే 29వ తేదీన పార్ట్‌ టైం ఉద్యోగమంటూ మెసేజ్‌ వచ్చింది. దీంతో ఆ మహిళ తన వివరాలను అపరిచిత వ్యక్తులు చెప్పిన విధంగా నమోదు చేసి నగదు పెడుతూ టాస్కులు చేస్తూ వచ్చింది. చివరకు తాను పెట్టిన రూ.1,48,972లకు రెట్టింపైన నగదును ఇవ్వాలని అడగగా స్పందన రాలేదు. దీంతో బాధితురాలు తాను మోసపోయినట్లు గుర్తించి అమీన్‌పూర్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.